క్లుప్తంగా

ముగిసిన వీవోఏల శిక్షణ



వీవోఏలకు శిక్షణ ఇస్తున్న వెలుగు సిబ్బంది

మాకవరపాలెం: వీవోఏలకు రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన శిక్షణ ముగిసిందని వెలుగు ఏపీఎం చినబాబు తెలిపారు. డ్వాక్రా సంఘ సభ్యులకు సంబంధించిన అన్ని వివరాలను నమోదు చేసేందుకు లోకాస్ యాప్ రూపొందించారు. ఈ యాప్ వినియోగంపై గురు, శుక్రవారాలు స్థానిక వెలుగు కార్యాలయంలో వీవోఏలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ సభ్యుల పేర్లు, రుణాలు మంజూరు, చెల్లింపులకు చెందిన పూర్తి సమాచారం లోకాస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. వెలుగు సీసీలు పాల్గొన్నారు.

వేసవిలో ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలి



చంద్రయ్యపేటలో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారి నిర్మల

కె.కోటపాడు: వేసవిలో వైద్య సిబ్బంది ఇచ్చే ఆరోగ్య జాగ్రత్తలను వృద్ధులు, చిన్నారులు తప్పకుండా పాటించాలని చౌడువాడ పీహెచ్‌సీ వైద్యాధికారి నిర్మల తెలిపారు. ఫ్యామిలీ డాక్టరు కార్యక్రమంలో భాగంగా శుక్రవారం చంద్రయ్యపేటలో 79 మంది రోగులను ఆమె పరీక్షించారు. ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య జాగ్రత్తలను పాటించిన పక్షంలో వడదెబ్బ బారిన పడకుండా ఉండవచ్చన్నారు. వైద్యం పొందే పరిస్థితి లేని ఐదుగురి ఇళ్లకు వెళ్లి ఆరోగ్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో కె.వి.రాజశేఖర్, హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎన్.రాజు, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏటా ఒకసారి ఈనిక లాభదాయకం



మాట్లాడుతున్న పశువైద్యాధికారి నాయుడు

కె.కోటపాడు: ఏటా ఒక దూడ పుట్టే విధంగా జాగ్రత్తలను పాటిస్తే పాడి లాభదాయకంగా ఉంటుందని కొరువాడ పశువైద్యాధికారి సిహెచ్.వై.నాయుడు తెలిపారు. పశు విజ్ఞాన బడిలో భాగంగా శుక్రవారం ఆర్.వై.అగ్రహారంలో రైతులకు పశువుల పెంపకంలో పాటించాల్సిన జాగ్రత్తలను వివరించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి మాట్లాడుతూ ఈనిన 60 నుంచి 90 రోజుల లోపుగా చూడి ఇంజక్షన్లు పశువుకు వేయించాలన్నారు. అదేవిధంగా పుట్టిన పది రోజుల లోపు లేగదూడలకు నట్టల నివారణ మందును వేయించాలన్నారు. ఆపై ప్రతీ నెలకు ఒక సారి ఆర్నెల్లపాటు వేయించాలని సూచించారు. ఈ విధంగా పెయ్యిలను సంరక్షిస్తే ఎదుగుదల బాగుంటుందని, సకాలంలో ఎదకు వస్తాయని వివరించారు. ఆర్బీకే పశువైద్య సహాయకుడు హనుమంతు పాల్గొన్నారు.

నేడు ఎం. కోడూరులో 'గడప గడపకు'

మాడుగుల రూరల్: ఎం. కోడూరులో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించనున్నట్లు సర్పంచ్ గొల్లవిల్లి సంజీవిరావు, పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పడాల అప్పలనాయుడు శుక్రవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు హాజరవుతారన్నారు. ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పీఏసీఎస్, పాల సొసైటీ అధ్యక్షులు, తదితరులు పాల్గొనాలని కోరారు.

పశువ్యాధులపై అప్రమత్తత

మాకవరపాలెం: వేసవిలో పశువులకు వచ్చే వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని రాచపల్లి పశువైద్యాధికారి అనిల్‌కుమార్ సూచించారు. తామరం రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం పాడిరైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం పశువులకు సోకే వ్యాధులు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తూర్పు కాపు సంఘ మండల అధ్యక్షుడు మరిబాబు, పీఏసీఎస్ డైరెక్టర్ అయ్యన్న పాల్గొన్నారు.

దిబ్బిడి గ్రామాభివృద్ధే ధ్యేయం

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



దిబ్బిడిలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



గ్రామ అభివృద్ధికి సహకరిస్తున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీని సత్కరిస్తున్న గ్రామస్తులు

బుచ్చెయ్యపేట: అర్హతే ప్రామాణికంగా ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తుందని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ తెలిపారు. గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దిబ్బిడిలో వలంటీర్లు, గ్రామ సచివాలయ ఉద్యోగులు, నాయకులతో కలిసి ఇంటింటికి తిరిగి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ సేవలు, పథకాలు సంక్రమంగా అందుతున్నాయా? లేదా అని ప్రతి గడపలోను ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలు మేరకు సాంకేతిక లోపాల వల్ల అర్హులెవరైనా ఇంకా ఉండిపోతే వారికి న్యాయం చేస్తామన్నారు. గడప గడపలో గుర్తించిన సమస్యలను పరిష్కరించడంతోపాటు అర్హులకు తక్షణమే సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు. దిగువ వీధి, ఎస్సీ కాలనీ, హై స్కూల్ దగ్గర వంతెన, తదితర ప్రదేశాల్లో మురుగు నీరు బయటకు పోయేలా డ్రైనేజీలు ఏర్పాటు చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. అసంపూర్తిగా ఉన్న 20 ఇళ్లకు బిల్లులు అందించాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. గ్రామంలో పాఠశాలను నాడు- నేడు కింద అభివృద్ధితోపాటు రూ.70 లక్షలతో ఇంటింటికీ కుళాయిలు ఏర్పాటు చేస్తామన్నారు. 68 మంది పేదలకు జగనన్న కాలనీలో ఇంటి స్థలాలు, ఇళ్ల మంజూరుతోపాటు గడప గడపలో తన దృష్టికి వచ్చిన సమస్యల పరిష్కారానికి రూ.20 లక్షలు మంజూరు చేశామని తెలిపారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వ విప్‌ను సర్పంచ్ పెదిరెడ్ల మాణిక్యం, వైస్ ఎంపీపీ గొంపా చినబాబు, గ్రామ పెద్దలు గొంపా అప్పారావు, సియాద్రి తాత బాబు, జెర్రిపోతుల అప్పలనాయుడు, నాగభూషణం, రామారావు తదితరులు సత్కరించారు. వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు, విశాఖ డెయిరీ డైరెక్టర్ గేదెల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, నాయకులు సుంకరి శ్రీను, గోపిశెట్టి శ్రీను, సత్తిబాబు, చందు పాల్గొన్నారు.

సభ్య రైతుల సంక్షేమానికి సహకారం

- విశాఖ డెయిరీ ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్



పాల రైతులకు ప్రోత్సాహకాలు అందిస్తున్న డెయిరీ ఛైర్మన్ ఆనంద్‌కుమార్

కె.కోటపాడు: విశాఖ డెయిరీ పాల సంఘాల్లో ప్రతి రైతు సంక్షేమానికి ఎల్లప్పుడూ సహకారాన్ని అందించనున్నట్లు ఛైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. దాలివలసలోని రెండు పాల సేకరణ కేంద్రాల్లో సభ్య రైతులకు శుక్రవారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత మేలు జాతి పెయ్యల ప్రదర్శనను ఆయన తిలకించారు. అనంతరం రెండు పాల కేంద్రాల్లో అత్యధికంగా పాలు పోస్తున్న ఐదుగురు రైతులకు ప్రోత్సాహకాలు అందించారు. అనంతరం మాట్లాడుతూ డెయిరీ ద్వారా సభ్య రైతులకు, పశువులకు బీమా సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు తెలిపారు. పాడి పశువుల కొనుగోలుకు రూ.40 వేల వడ్డీ లేని రుణాన్ని రూ.60 వేలకు పెంచినట్లు తెలిపారు. ఇక్కడ రైవాడ కెనాల్ నుంచి శెట్టిబలిజ కళ్లాలకు వెళ్లే కిలోమీటరు మట్టిరోడ్డును గ్రావెల్ రోడ్డు నిర్మాణానికి ఐదు చేతిపంపులకు నిధులు మంజూరు చేశారు. అనంతరం ఆనంద్‌కుమార్‌ను సభ్య రైతులు దుశ్శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, పాల సంఘాల అధ్యక్షులు భూమిరెడ్డి ఈశ్వరరావు, కూండ్రపు దేముళ్లు, సర్పంచ్ భూమిరెడ్డి దేముళ్లు, మాజీ సర్పంచ్ ఆదిరెడ్డి రామునాయుడు పాల్గొన్నారు.

విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందజేత



విద్యార్థులకు వాలీబాల్ కిట్ అందిస్తున్న దత్తకార్తికేయ

చీడికాడ: తురువోలు ఉన్నత పాఠశాలలో చదువుతున్న తంగుడుబిల్లి గ్రామ విద్యార్థులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు మనవుడు ఈర్లె దత్తకార్తికేయ వాలీబాల్ కిట్ అందించినట్లు వైఎస్సార్‌సీపీ గ్రామ నేత జె.వెంకటరమణ గురువారం తెలిపారు. వారం రోజుల క్రితం తంగుడుబిల్లి మార్గంలో కె.కోటపాడు జెడ్పీటీసీ ఈర్లె అనూరాధ కారులో వెళ్తుండగా, వాలీబాల్ కిట్ అందించాలని తంగుడుబిల్లి విద్యార్థులు కోరారన్నారు. ఆ మేరకు ఆమె అందించారన్నారు.

మున్సిపల్ మిగులు బడ్జెట్‌కు ఆమోదం



మాట్లాడుతున్న ఛైర్మన్ అప్పలనాయుడు



సమావేశానికి హాజరైన కౌన్సిలర్లు

నర్సీపట్నం: మున్సిపాలిటీ అభివృద్ధిని కాంక్షిస్తూ ప్రవేశపెట్టిన బడ్జెట్ ప్రజారంజక బడ్జెట్ అని మున్సిపల్ ఇన్‌చార్జి ఛైర్మన్ తమరాన అప్పలనాయుడు పేర్కొన్నారు. ఛైర్మన్ అధ్యక్షతన శుక్రవారం జరిగిన సమావేశంలో మున్సిపల్ అధికారులు బడ్జెట్ ప్రవేశపెట్టారు. ప్రారంభంలోనే టీడీపీ కౌన్సిలర్లు బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ సభ నుంచి వాకౌట్ చేశారు. సభలో రూ.18,97,63,549 నిల్వతో మిగులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. అధికార పక్ష సభ్యులు బడ్జెట్‌కు సంపూర్ణ మద్దతు తెలిపారు. 2023–24 సంవత్సరానికి మున్సిపాలిటీకి రూ.40,09,75,000 ఆదాయం రాగా, రూ.29,00,54,000 ఖర్చు పోను రూ.18,97,63,549 నిల్వ ఉంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ బడ్జెట్‌పై చర్చించే ఓపిక టీడీపీ కౌన్సిలర్లకు లేకపోవటం దురదృష్టకరమన్నారు. వారికి సొంత ఎజెండా తప్ప ప్రజా సమస్యలు పట్టడం లేదని ఆగ్రహించారు. నర్సీపట్నం మెయిన్ రోడ్డు విస్తరణకు సంబంధించి ఆర్డీపీ నుంచి ఆమోదం లభించిందన్నారు. ప్రజా అవసరాల రోడ్డు విస్తరణకు సంకల్పించిన ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ పురపాలక ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. త్వరలోనే నోటీసులు జారీ చేసి రోడ్డు విస్తరణ పనులకు అధికారులు శ్రీకారం చుడతారన్నారు. కుక్కలు, పందుల బెడదతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని జనసేన కౌన్సిలర్ అద్దేపల్లి సౌజన్య సభ దృష్టికి తీసుకెళ్లారు. వార్డుల్లో శానిటేషన్ మెరుగుపర్చాలని కోరారు. సభ దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఛైర్మన్ హామీ ఇచ్చారు. సమావేశంలో కమిషనర్ కనకారావు, కౌన్సిలర్లు, మున్సిపల్ వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలకు రేషన్ ఇవ్వాలని డిమాండ్



రొచ్చుపణుకులో గిరిజనులతో మాట్లాడుతున్న అజయ్‌కుమార్

రావికమతం: చీమలపాడు పంచాయతీ శివారు పలు గిరిజన గ్రామాల్లో ప్రజలకు మూడు నెలలుగా అందని రేషన్ బియ్యాన్ని నష్టపరిహారంతో సహా ఇప్పించాలని, లేకుంటే వచ్చే నెల 1న తహసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని అఖిల భారత వ్యవసాయ, గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పి.ఎస్. అజయ్‌కుమార్ హెచ్చరించారు. శుక్రవారం ఆయన రొచ్చుపణుకులో పలు గ్రామాల గిరిజనులతో సమావేశమయ్యారు. కల్యానపులోవ జీసీసీ డిపో సేల్స్‌మన్, ఇక్కడి కోటా డీలర్ సంయుక్తంగా పేదలకు మూడు నెలలుగా రేషన్ బియ్యాన్ని ఇవ్వలేదన్నారు. దీనిపై అధికారులు ఇప్పటికే విచారణ చేసి సేల్స్‌మన్‌పై కేసు పెట్టారని, పేదల బియ్యం పక్కదారి పడుతున్నా మౌనం వహిస్తున్నారని దుయ్యబట్టారు.

జిల్లాలోనే నాతవరం మండలంలో అధిక 'ఉపాధి'



ఉపాధి పనులు చేస్తున్న వేతనదారులు

నాతవరం: జిల్లాలోనే అత్యధికంగా ఉపాధి హామీ పథకం కూలీలు పని చేస్తున్నారని ఎంపీడీవో లోకుల యాదగిరీశ్వరరావు తెలిపారు. ఆయన శుక్రవారం నాతవరం, వల్సంపేట గ్రామాల్లో ఉపాధి హామీ పనులను పరిశీలించారు. క్షేత్రస్థాయిలో కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ జిల్లాలోనే అధికంగా రోజు ఒక్కంటికి పది వేలకు పైగా ఉపాధి వేతనదారులు నాతవరం మండలంలో పని చేస్తున్నారన్నారు. రెండో స్థానంలో మాకవరపాలెం మండలం ఉందన్నారు. రోజుకు గరిష్ట వేతనం రూ.266 వస్తుందన్నారు. ఉపాధి హామీలో ఎలాంటి అవకతవకలకు తావివ్వకుండా నిత్యం క్షేత్రస్థాయిలో పరిశీలన ఉంటుందన్నారు. వచ్చే నెల నుంచి రోజు ఒక్కంటికి 15 వేలు కూలీలకు పని కల్పించేందుకు ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో టీసీ దేముడు, వీఆర్పీలు పాల్గొన్నారు.

నేడు ఆలయ భూముల కౌలు వేలం

మాకవరపాలెం: పి.పి.అగ్రహారం అమృతేశ్వరస్వామి ఆలయ భూములను కౌలుకిచ్చేందుకు శనివారం వేలం నిర్వహిస్తున్నట్లు దేవదాయ శాఖ అధికారులు తెలిపారు. మూడేళ్లపాటు 16.10 ఎకరాల భూమి కౌలు వేలం కొనసాగుతుందన్నారు. మధ్యాహ్నం 2 గంటలకు ఆలయం వద్ద వేలంలో రూ.5 వేలు దరావతు చెల్లించి పాల్గొనాలని కోరారు.

నేడు పెద్దేరును సందర్శించనున్న చీఫ్ ఇంజనీర్

మాడుగుల: పెద్దేరు జలాశయం కాలువలు పరిశీలించడానికి చీఫ్ ఇంజనీర్ సుగుణాకర్ రానున్నారని వైస్ ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకట రాజారామ్ శుక్రవారం తెలిపారు. ఈ సందర్భంగా జేడీపేటలో రైతులతో సమావేశం కానున్నారన్నారు. మండలంలో జేడీపేట, ఒమ్మలి, ఎం. కె వల్లాపురం, ఎం. కోటపాడు, వీరనారాయణం, చింతలూరు, గాదిరాయి, సత్యవరం గ్రామాలకు చెందిన ఆయకట్టు రైతులు హాజరు కావాలని కోరారు. కాలువ లైనింగ్ పనులకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు కృషి ఫలితంగా రూ.84 కోట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. ముందుగా ఎం.కోడూరులో డిప్యూటీ సీఎంను కలుస్తారన్నారు. సర్పంచ్ కొసిరెడ్డి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డీఎఫ్‌వో కార్యాలయం వద్ద ధర్నా

నర్సీపట్నం: ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో సాగుదారులు శుక్రవారం డీఎఫ్‌వో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకుడు సత్తిబాబు మాట్లాడుతూ గొలుగొండ మండలం యల్లవరం పంచాయతీ డొంకాడ గ్రామానికి చెందిన గిరిజనులు 22 ఏళ్లగా అటవీ భూములను సాగు చేసుకుంటున్నారన్నారు. వారి భూములకు సర్వే చేసి ఆర్వోఎఫ్ఆర్ పట్టాలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డీఎఫ్‌వో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం అందజేశారు. అడిగర్ల రాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లులు నిర్ణీత వ్యవధిలో చెల్లించండి

- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌బాబు

నర్సీపట్నం: వినియోగదారులు నిర్ణీత వ్యవధిలో విద్యుత్ బిల్లులు చెల్లించటం ద్వారా ఎలాంటి అపరాధ రుసుం ఉండదని నర్సీపట్నం ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సురేష్‌బాబు పేర్కొన్నారు. సకాలంలో బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలన్నారు. ప్రతినెలా బిల్లులు జారీ చేసిన 15 రోజుల్లోగా చెల్లిస్తే అపరాధ రుసుం ఉండదన్నారు. కాలపరిమితి ముగిసి తర్వాత చెల్లిస్తే గృహ, వ్యవసాయేతర వినియోగదారులకు నెలకు నూటికి రూ.1.50పైసలు అపరాధ రుసుం విధిస్తామన్నారు. బిల్లు జారీ చేసిన 30 రోజుల్లోగా చెల్లించకపోతే విద్యుత్తు సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు. వినియోగదారులు రీకనెక్షన్ చార్జీలతో కలిపి బిల్లు చెల్లిస్తేనే కనెక్షన్ పునరుద్ధరిస్తామన్నారు. బిల్లుల రీడింగ్ సిబ్బందికి సహకరించాలన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రావికమతం: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో ఖాళీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీవో పుష్పదేవి శుక్రవారం తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం నేతవానిపాలెం ఆయా(ఎస్సీ), పీపీ అగ్రహారం-2(ఎస్టీ), రావికమతం మండలం తట్టబంద ఆయా(ఎస్టీ), రోలుగుంట మండలం అంట్లంపాలెం ఆయా (ఎస్సీ) పోస్టులకు రావికమతం కార్యాలయానికి మే 5వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

కొంతలం పంచాయతీకి ఉత్తమ పురస్కారాలు



ప్రశంసాపత్రాలతో సర్పంచ్ వంశీ రవిచంద్ర, కార్యదర్శి శ్రీదేవి

రోలుగుంట: కొంతలం ఉత్తమ పంచాయతీగా ఎంపికైన సందర్భంగా సర్పంచ్ వంశీ రవిచంద్రకు, పంచాయతీ కార్యదర్శి ఎం.శ్రీదేవికి అయిదు పురస్కారాలను ఎంపీడీవో కె.ప్రభాకరరావు ప్రదానం చేశారు. సుపరిపాలన, ఆరోగ్యం, పరిశుభ్రం, 'స్వయం సమృద్ధితో మౌలిక సదుపాయాలు, మహిళా స్నేహపూర్వక గ్రామ పంచాయతీ విభాగాల్లో ఐదు పురస్కారాలకు ఎంపికైంది. ఈ సందర్భంగా సర్పంచ్, పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ సచివాలయ సిబ్బందితో సమష్టిగా సేవలందించి ఏటా ఈ గుర్తింపు కొనసాగేందుకు కృషి చేస్తామని తెలిపారు.

నగదు విత్‌డ్రాపై స్పష్టమైన ఆదేశాలివ్వాలి

- ఎంపీడీవోకు పంచాయతీ కార్యదర్శుల వినతి



ఎంపీడీవోకు వినతిపత్రం ఇస్తున్న పంచాయతీ కార్యదర్శులు

మాకవరపాలెం: ప్రతి నెలా పింఛను నగదును వెల్ఫేర్ అసిస్టెంట్‌తోపాటు ఎవరెవరు విత్‌డ్రా చేయాలో స్పష్టమైన ఆదేశాలివ్వాలని ఎంపీడీవో అరుణశ్రీకి పంచాయతీ కార్యదర్శులు వినతిపత్రం అందజేశారు. గత నెల 3న శెట్టిపాలెంలో పింఛను సొమ్ము తీసుకెళ్తుండగా, రూ.16.15 లక్షలు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకుపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌తోపాటు సచివాలయ మహిళా పోలీసు, వలంటీర్ వెళ్లి నగదు విత్‌డ్రా చేసుకురావాలని కార్యదర్శులకు మెమో జారీ చేశారు. అయితే ఎస్ఐ మౌఖిక ఆదేశాలతో మహిళా పోలీసులు తిరస్కరించారని కార్యదర్శులు శుక్రవారం ఎంపీడీవో దృష్టికి తీసుకొచ్చారు. నగదు విత్‌డ్రా చేసి తీసుకువెళ్లే సమయంలో రక్షణ చర్యలు తీసుకునేలా చూడాలని వారంతా కోరారు.

క్షయ వ్యాధిగ్రస్తులకు పౌష్టికాహార కిట్లు పంపిణీ



క్షయ వ్యాధిగ్రస్తులకు కిట్లు పంపిణీ చేస్తున్న వైద్యాధికారి ప్రసన్న

నాతవరం: క్షయ వ్యాధిగ్రస్తులను ఆదుకునేందుకు ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని నాతవరం పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రసన్న అన్నారు. నాతవరం, గునుపూడి పీహెచ్‌సీల పరిధిలోని 21 మంది క్షయ వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ఉచితంగా 9 రకాలు పౌష్టికాహార కిట్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకిన వారిలో దగ్గు, జ్వరం ఆకలి మందగించడం, బరువు తగ్గడం, రక్తంతో కూడిన దగ్గు, రాత్రిపూట చెమటలు పట్టడం, వంటి లక్షణాలు కలిగి ఉంటాయన్నారు. ఎల్లప్పుడు అలసిపోవడం, నొప్పి అధికంగా ఉండటం, చాతి నొప్పి వంటి సమస్యలు అధికంగా ఉంటాయన్నారు. మధుమేహం, కిడ్నీ వ్యాధి, హెచ్ఐవీ సోకిన వారికి అధికంగా క్షయ వస్తుందన్నారు. వీరి కోసం ఈ నెల కేజీ చొప్పున కందిపప్పు, చోడిపిండి, గోధుమ పిండి, వేరు శనగ గుళ్లు, బెల్లం, నూనె, కొమ్ము శనగలు, పెసరపప్పు కిట్ల రూపంలో ఇచ్చిందన్నారు. వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

డ్వాక్రా సంఘాల నిర్వహణలో లోకాస్ యాప్ కీలకం

- సిబ్బంది శిక్షణా కార్యక్రమంలో వైఎస్సార్ క్రాంతి పథం ఏపీడీ డైజీ



మాట్లాడుతున్న వైఎస్సార్ క్రాంతి పథం జిల్లా ఏపీడీ డైజీ

చోడవరం: స్వయం సహాయక సంఘాల ఆర్థిక లావాదేవీలు పారదర్శకంగా ఉండాలన్న ఉద్దేశంతో లోకాస్ యాప్ వినియోగంపై సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని వైఎస్సార్ క్రాంతి పథం జిల్లా అదనపు ప్రాజెక్టు అధికారి డైజీ అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో 12 మండలాల పరిధిలోని వైఎస్సార్ క్రాంతి పథం సిబ్బందికి శిక్షణా శిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏపీడీ డైజీ మాట్లాడుతూ లోకాస్ యాప్ ద్వారా డ్వాక్రా సంఘాల నిర్వహణపై పూర్తిగా పర్యవేక్షణ ఉంటుందన్నారు. జాతీయ గ్రామీణ జీవనోపాధి పథకం ద్వారా అమలవుతున్న పథకాలన్నీ ఒకే యాప్ ద్వారా నిర్వహణ చేసేందుకు దోహదపడుతుందన్నారు. ఈ యాప్‌లో డ్వాక్రా సంఘాల సభ్యుల వివరాలు, అప్పులు, పొదుపు ఆర్థిక లావాదేవీలన్నీ నమోదు చేయాలన్నారు. మండల, గ్రామ సమాఖ్యల నిర్వహణపై సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాలన్నారు. ఏరియా కో ఆర్డినేటర్ రత్నప్రభ, చంద్రకళ, ఏపీఎం కనకరాజు, ఏపీవోలు, సీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ముందడుగేద్దాం



మాట్లాడున్న సత్యనారాయణమూర్తి

నర్సీపట్నం: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టేందుకు ప్రజలు సమాయత్తం కావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి తెలిపారు. స్థానిక ఎన్జీహోమ్‌లో సీపీఐ, సీపీఎం నిర్వహించిన రాజకీయ ప్రచార భేరి సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడిందన్నారు. అదానీ, అంబానీ వంటి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతున్నారని దుయ్యబట్టారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. జిల్లాలో కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమల స్థాపన తప్ప వ్యవసాయ గురించి పట్టడం లేదని విమర్శించారు. ప్రజాస్వామ్య పరిరక్షణకు అందరం కలిసి ముందడుగేద్దామన్నారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రభుత్వాన్ని సాగనంపేందుకు ప్రజలంతా కలిసి రావాలని పిలుపునిచ్చారు. అనంతరం సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు సత్తిబాబు, సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, సీపీఐ జిల్లా కార్యదర్శి రామునాయుడు, సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు జగ్గునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు అప్పలరాజు తదితర్లు కేంద్ర ప్రభుత్వ విధానాలపై విరుచుకుపడ్డారు. వామపక్ష నాయకులు సాపిరెడ్డి నారాయణమూర్తి, రాజు, సూర్యప్రభ, కొండలరావు, రాధాకృష్ణ పాల్గొన్నారు.

పంచాయతీల అభివృద్ధికి సేవలు విస్తృతం



మాట్లాడుతున్న జిల్లా అధ్యక్షుడు శివ

రోలుగుంట: పంచాయతీల అభివృద్ధికి కార్యదర్శుల సేవలు విస్తృతపరుస్తున్నామని సంబంధిత యూనియన్ జిల్లా అధ్యక్షుడు పెంకి శివ అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం మధ్యాహ్నం మండల స్థాయి పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారి సమస్యలు, చేయాల్సిన అభివృద్ధి పనులు తదితర సేవల గురించి మాట్లాడారు. అనంతరం ఈవోపీఆర్డీ మల్లికార్జునరావుతో కలిసి కార్యదర్శుల నూతన డైరీని ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా జనరల్ సెక్రటరీ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శులు మట్ట రాజశేఖర్, చిరంజీవి పాల్గొన్నారు.

ఎర్నితలమ్మ తీర్థం గోడ పత్రిక విడుదల



గోడపత్రికను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం

దేవరాపల్లి: ఎస్.జి. నగరం పంచాయతీ శివారు వడ్రపాలెంలో ఎర్నితల్లమ్మ తీర్థానికి సంబంధించి గోడ పత్రికను డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు విడుదల చేశారు. గ్రామ ఉత్సవ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తారువ క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయన్ను కలిశారు. ఈ నెల 30న జరిగే అమ్మవారి తీర్థానికి హాజరు కావాలని కోరారు. ఆ రోజు జిల్లా స్థాయి ఎడ్ల పోటీలు, ఇతరత్రా సాంస్కృతిక, ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ కె. సత్యారావు, మాజీ సర్పంచ్ కె. నాయుడు పాల్గొన్నారు.